

## ఎన్నికల సమస్యలపై చర్చలకు ఈసీ ఆహ్వానం

విజయనగరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎన్నికల అధికారి ఈఆర్‌వో, రాష్ట్ర ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారం కాని ఎన్నికల సంబంధిత సమస్యలపై చర్చించేందుకు రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్నికల సంఘం డైరెక్టరు అనిల్‌చంద్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు లేదా సీనియర్ పార్టీ నాయకులతో చర్చిస్తామన్నారు. ఈ మేరకు అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు లేఖలు రాసినట్లు తెలిపారు. పార్టీల ప్రతినిధులతో చర్చలు, సమావేశాలు నిర్వహించి వారు లేవనెత్తిన అంశాలను పరిశీలించి ఈ నెల 31లోగా చర్యల కోసం నివేదిక సమర్పించాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఆదేశించినట్లు తెలిపారు.

# మార్గం సుగమం



పెందుర్తి-బొడ్డవర రోడ్డు

- పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు నిర్ణయం
- 195 ఎకరాల భూసేకరణ
- పరిహారం కింద రూ.2.98 కోట్లు
- 42 కిలోమీటర్ల దూరానికి రూ.782.91కోట్ల అంచనాతో టెండర్లు ఖరారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి మద్దతుగా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు విస్తరణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోపే చర్యలు తీసుకుంటున్నారు. 195 ఎకరాలు సేకరించాలని అంచనా వేశారు. భూములిచ్చేవారికి పరిహారం కింద రూ.2.98 కోట్లు ఇవ్వనున్నారు. మొత్తం 42 కిలోమీటర్లలో రోడ్డు విస్తరణకు రూ.782.91కోట్ల అంచనాతో టెండర్లు ఖరారయ్యాయి.

శృంగవరపుకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు చర్యలు ఊపందుకున్నాయి. విశాఖపట్నం ఎన్ఏడీ కూడలి నుంచి పెందుర్తి వరకు వున్న జాతీయ రహదారి-16ను దశాబ్దం క్రితమే విస్తరించారు. అక్కడ నుంచి శృంగవరపుకోట మండలం బొడ్డవర వరకు వున్న దాదాపు 42 కిలోమీటర్ల దూరం ఇంతవరకు విస్తరణకు నోచుకోలేదు. కొత్తవలస మండలం చింతలపాలెం నుంచి బొడ్డవరకు వరకు శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. పెందుర్తి నుంచి సరిపల్లి వరకు కేవలం కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల లోపు మాత్రమే విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలో ఉంది. జాతీయ రహదారి - 516గా పిలుస్తున్న ఈ రోడ్డు గుండానే బొర్రాగుహలు, అరకు పర్యాటక ప్రాంతానికి వెళ్లనున్నారు. దీన్నిప్పుడు జాతీయ రహదారి-16 నుంచి తాటిపూడి మీదుగా విజయనగరం ముందువరకు వున్న జాతీయ రహదారి 516కు బొడ్డవర వద్ద కలిపేలా విస్తరించనున్నారు. ఇందుకు రూ.782.91 కోట్ల అంచనాతో టెండర్‌లు వారం రోజుల క్రితమే ఖరారయ్యాయి. టీటీ (టాక్స్ అండ్ టవర్స్) ఇన్‌ఫ్రాటెక్ సంస్థ టెండర్ దక్కించుకున్నట్లు జాతీయ రహదారుల శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ రోడ్డు విస్తరణకు అవసరమైన భూ సేకరణ తంతులో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. 137.78 ఎకరాల వ్యవసాయ భూమి, 57.37 ఎకరాల వ్యవసాయేతర భూమిని గుర్తించారు. పరిహారం చెల్లింపునకు నిధులు రూ.2,98,34,304 సిద్ధం చేశారు. ఇప్పటికే కొత్తవలస (మిగతా 8వ పేజీలో..)

# నిత్యం నీటి యుద్ధాలే



- తాగునీటికి తప్పని కష్టాలు
- ట్యాంకర్ల వద్ద సిగపట్లు
- వేసవిలో తీవ్రమయ్యే అవకాశం
- ప్రజల్లో ఆందోళన

6లో

# ఏం కష్టమొచ్చిందో!

- ఇద్దరు పిల్లలతో కాలువలో దూకిన తల్లి
- ఇద్దరిని రక్షించిన మత్స్యకారులు
- చిన్నారి గల్లంతు
- మద్దువలస కుడి కాలువ వద్ద ఘటన

వంగర, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఎం కష్టమొచ్చిందో ఏమో! ఇద్దరు పిల్లలతో మద్దువలస కుడి ప్రధాన కాలువలో దూకింది. స్థానిక మత్స్యకారులు సకాలంలో గమనించడంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. చిన్నారి గల్లంతైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కింజంగి గ్రామానికి చెందిన గుంట శ్రావణికి పదేళ్ల క్రితం బలిజిపేట మండలం గంగాడకు చెందిన కళింగ సుధతో వివాహమైంది. కొన్ని సంవత్సరాల వరకు వీరి వివాహ జీవితం సాఫీగానే సాగింది. ఇద్దరు పిల్లలు జన్మించాక కూడా ఇబ్బందులేవీ రాలేదు. కొన్నాళ్ల కిందట భర్త అనారోగ్యం బారిన పడ్డాడు. మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. దీంతో శ్రావణి భర్తను వదిలి తల్లిదండ్రుల వద్దకు పిల్లలతో వచ్చేసింది. పిల్లలను చదివించుకుంటూ కింజంగిలో ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం ఎం జరిగింతో కాని పిల్లలతో మద్దువలస రిజర్వాయర్ సమీపాన ఉన్న కుడి కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడికి సమీపంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు గమనించి వెంటనే పరుగున వచ్చి తల్లీకొడుకును కాపాడు. పాప ఆచూకీ మాత్రం తెలియలేదు. మంగళవారం సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్‌శంకర్ తెలిపారు. పాప ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు వివరించారు.



పాప ఆచూకీ కోసం మద్దువలస కాలువలో గాలింపు (ఇన్‌సెట్‌లో) తల్లీకొడుకు

## పైడితల్లి.. భక్తజనం ప్రణమిల్లి



అమ్మవారి దర్శనానికి బారులు

రాజాం/రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర చివరిరోజు మంగళవారం రాజాం పట్టణం భక్తజనంతో పోటెత్తింది. ప్రధాన రహదారి అంతా కిటకిటలాడింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మంగళవారం రాత్రి ఘటోత్సవం ముగిసే వరకూ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా వస్తూనే ఉన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీరతో పాటు గాజులు సమర్పించారు. సంప్రదాయం (మిగతా 8వ పేజీలో..)

## తప్పంతా మీపై పెట్టుకుని..!

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వైసీపీ పంగనామం
- అధికారం కోల్పోయాక అదే అంశంపై ఆందోళనలు
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపణలు

రాజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ వైసీపీ బుధవారం నిరసనలకు పిలుపునివ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లుల బకాయి పెట్టిందే వైసీపీ ప్రభుత్వం కావడంతో ఆందోళనకు దిగుతుండడాన్ని అందరూ తప్పుబడుతున్నారు.

జిల్లాలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ భారీగా పేరుకుపోయింది. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు (మిగతా 8వ పేజీలో..)

# నిత్యం నీటి యుద్ధాలే!

ఆంధ్రజ్యోతి పరిశీలన

వేసవి ఇప్పుడే మొదలైంది. కానీ పట్టణాలు...పల్లెలు అనే తేడా లేకుండా ప్రతి చోటా నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి ఉన్న నీటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికీ వివిధ మున్సిపాలిటీల్లోని శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల నీరే ఆధారం. అవీ అరకొరగా ఉండడంతో నీటి కోసం మహిళలు యుద్ధాలు చేయడం నిత్యకృత్యంగా మారింది. అధికార యంత్రాంగం స్పందించి...నీటి కష్టాల నుంచి ఒడ్డెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

- తాగునీటికి తప్పని కష్టాలు
- ట్యాంకర్ల వద్ద సిగపట్లు
- వేసవిలో తీవ్రమయ్యే అవకాశం
- ప్రజల్లో ఆందోళన

## వేసవి గండం గడిచేదెలా?



తాగునీటి సమస్య ఉన్న వైఎస్ఆర్ నగర్

విజయనగరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విజయనగరం జనాభా పెరుగుతోంది. కానీ అందుకు అనుగుణంగా తాగునీటి వనరులు పెరగడం లేదు. నగరానికి మూడు వాటర్‌వర్క్స్ (నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి) నుంచి నీటి సరఫరా జరుగుతోంది. విజయనగరం ప్రజలకు నిత్యం 40 ఎంఎల్‌డీ (మిల్లీలీటర్ పర్ డే) అవసరం. ప్రస్తుతం 26 ఎంఎల్‌డీ సరఫరా అవుతోంది. వేసవిలో నీటి లభ్యత తగ్గి కేవలం 22 నుంచి 23 ఎంఎల్‌డీ మాత్రమే వస్తుంటుంది. నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. రోజు తప్పించి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. మార్చి నెలలో కొంతవరకు ఇబ్బంది లేకపోయినా ఏప్రిల్, మే నెలల్లో తాగునీటికి అవస్థలు తప్పేలా లేవు. ఏప్రిల్, మే నెలల్లో సాధారణ వర్షపాతం కురిస్తే.. ఎప్పటిలాగానే 26 ఎంఎల్‌డీ వస్తుంది. లేదంటే ఇబ్బందే. నగరంలోని వైఎస్సార్ నగర్, సత్యనగర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో ఏటా తాగునీటికి కటకటే.

## నీళ్లు ఎప్పుడొస్తాయో!


నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

నెల్లిమర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలోని కొన్ని వార్డుల్లో కుళాయిల ద్వారా తాగునీరు సమయానికి రావడం లేదు. ఎప్పుడు వస్తుందో తెలియక మహిళలు వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చినా పరిస్థితిలో మార్పు లేదు. రెండు, మూడు రోజులకు ఒక సారే నీరు రావడంతో ఇబ్బందులకు గురికావలసి వస్తోంది. కొన్ని చోట్ల ప్రత్యేకంగా ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులు వార్డుకు ఒకటి చొప్పున పెట్టినా.. వాటి వద్ద పరిశుభ్రత లేకపోవడంతో అక్కడి నీరు పట్టుకునేందుకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. నగర పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. గాంధీనగర్ కాలనీతో పాటు ఎత్తు ప్రదేశాల్లో ఉన్న వీధుల్లో నీరు రాక మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకంగా నగర పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కూడా కనిపిస్తోంది. నెలిమర్ల నగర పంచాయతీ సమీపంలోనే చంపావతి నది ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.


వాటర్ ట్యాంకు వద్ద ఇలా..

### సమయానికి అందించాలి



ఇంటింటి కుళాయిల్లో నీరు సమయానికి రావడం లేదు. రెండు రోజులకు ఒకసారి రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేసవి కాలం కావడంతో మరింతగా అవస్థలు పడుతున్నాం. ట్యాంకులు ఏర్పాటు చేసినప్పటికీ పరిశుభ్రత లేకపోవడంతో తాగునీరు పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకుల వద్ద ప్లాట్‌ఫారాలు నిర్మించాలి.

- జమ్ము సత్యవతి, చందకవీధి, ఏడో వార్డు

### ఫ్లాట్‌ఫాం నిర్మించాలి



వీధుల్లో ట్యాంకులు ఏర్పాటు చేసినప్పటికీ ఫ్లాట్ ఫారాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాచు, చెత్త ఉండడంతో తాగు నీరు పరిశుభ్రంగా ఉండడం లేదు. దీనిపై అధికారులు స్పందించి..శుభ్రత చర్యలు చేపట్టాలి. ట్యాంకు వద్ద ఫ్లాట్‌ఫాం నిర్మించాలి.

- సీహెచ్ లీలావతి, కీర్తివీధి, నెల్లిమర్ల

## బొబ్బిలినీ వదలని నీటి కష్టాలు


బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీలో బోరు పరిస్థితి ఇలా..

బొబ్బిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో తాగునీటి ఎద్దడి షరా మామూలుగానే ఉంటోంది. 31 వార్డులలో సగం వార్డులకు పైగా తాగునీరు సక్రమంగా అందడం లేదని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్‌లను సమూలంగా మార్చాలని అధికారులు ఎప్పుడో గుర్తించారు. కొన్ని ప్రాంతాలలో మాత్రమే మార్చారు. మిగిలిన చోట్ల అవస్థలు తప్పడం లేదు. చింతాడవీధి, అప్పయ్యపేట, ఇందిరమ్మ కాలనీ, కొత్తఎరుకలి వీధి, మేదరబంద, ఓంకార్ జంక్షన్, రాజానగర్ కాలనీ తదితర ప్రాంతాలలో తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలో అన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు తాగునీరు ఇస్తున్నారు. గత పాలక వర్గాల హయాంలో బో ర్లువేసి నిధులు దిగమింగారన్న ఆరో పణలు ఉన్నాయి. అలాంటి బోర్లన్నీ ఇప్పుడు పూర్తిగా పనిచేయడం లేదు. ఇందిరమ్మ కాలనీలో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ కాలనీలో వేసిన బోర్లను ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్లు, కాలువలు నిర్మించడంతో అవి రహదారి కంటే కింద ఉంటున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పైపు లీకేజీల సమస్యలు ఎక్కువగా ఉండడంతో తాగు నీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేయలేక పోతున్నారు. ప్రజలు పన్నుల రూపేణా చెల్లిస్తున్న ప్రజాధనంలో అధిక మొత్తం లీకేజీలను అరికట్టడానికే సరిపోతోంది.


బొబ్బిలి ఓంకార్ థియేటర్ సమీపంలో తాగునీరు పడుతున్న మహిళలు


సింగారపు వీధిలో..


కొత్తఎరుకలి వీధిలో..

### బోర్లన్నీ బాగు చేయాలి

బొబ్బిలి పట్టణంలో పాడైపోయిన బోర్ల న్నిటినీ బాగు చేయాలి. బావులు రీచార్జి అయ్యేలా చర్యలు తీసుకోవాలి. కొత్తఎరుక లి వీధి ప్రాంతంలో పైపులైన్లు పాతవి కా వడంతో సమస్య తీవ్రంగా ఉంది. అవినీతి కి చెక్ పెడితేనే తాగునీరు ప్రజలకు సక్రమంగా అందుతుంది. ప్రతి నెలా మున్సిపల్ తీర్మానాల్లో తాగునీటి కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయనున్నట్టు ప్రతిపాదిస్తున్నారు. కానీ ఫలితం కనిపించడం లేదు.

- గొర్లె అంకులు, కొత్త ఎరుకలి వీధి, బొబ్బిలి

### తాగునీటి సమస్య తీవ్రం

ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. ట్యాంకు లతో నీటిని ఇస్తున్నారు. బోర్లు కనిపించకుండా పోయాయి. కొత్త పథకం వస్తే ఇక్కడ ట్యాంకు పెడతామంటున్నారు. అదెప్పుడు జరుగుతుందో తెలియదు. ఎండలు తీవ్రమవుతున్నాయి.

- లక్ష్మి, ఇందిరమ్మ కాలనీ

## తాగునీటికి కటకట!

రాజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య అంతా ఇంతా కాదు. పెరుగుతున్న పట్టణ ప్రజల అవసరాలకు సరిపడా తాగునీరు అందడం లేదు. దీంతో పట్టణ ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రాజాం మున్సిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. దాదాపు 12 వేల గృహాలు ఉంటాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 47,120 మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య 60 వేలకు పైగా ఉంటుందని అంచనా. మనిషికి దాదాపు రోజుకు 20 లీటర్లు అవసరం. ఈ లెక్కన 60 వేల మందికి రోజుకు లక్షా 20 వేల లీటర్ల నీరు అవసరం. అందులో సగం కూడా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. సారథి, కొత్తవలస, పొనుగూటి వలస, కొండంపేట గ్రామాలు సైతం మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. కానీ తాగునీరు మాత్రం అరకొరగానే సరఫరా అవుతోంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ యంత్రాంగం తాగునీటి సౌకర్యం కల్పించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. మున్సిపాలిటీలో ఏడు రక్షిత మంచినీటి పథకాల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. ఇవన్నీ ఎప్పుడో మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో నిర్మించినవే. ఈ మంచినీటి పథకాలకు తాగునీటి సరఫరా చేసే ఇన్‌ఫిల్టరేషన్ బావులను రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి వద్ద నాగావళిలో ఏర్పాటు చేశారు. అక్కడ నీటిని శుద్ధి చేసి... పైపులైన్ల ద్వారా రక్షిత మంచినీటి పథకాలకు తరలిస్తున్నారు. దశాబ్దాల కిందటి పైపులైన్లు కావడంతో పూర్తిగా పాడయ్యాయి. దీంతో తరచూ మొరాయిస్తు న్నాయి. పైపులు లీకులమయం కావడంతో తాగునీరు వృథా అవుతోంది. వ్యర్థాలు, మట్టి పైపులైన్ల నీటిలో కలిసిపోతున్నాయి. దీంతో తరచూ కుళాయిల్లో బురద నీరు వస్తోంది.


కుళాయిల వద్ద మహిళల పడిగాపులు

### పరిష్కరించండి

రాజాం పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. శివారు కాలనీలకు తాగునీరు అందడం లేదు. అధికారులు నీటి పన్నులు కట్టించుకుంటున్నారు. కానీ నీరు సరఫరా చేయడం పై శ్రద్ధ చూపడం లేదు. రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తుండడంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి.

- కె.సైడమ్మ, వస్త్రపురి కాలనీ, రాజాం

### ఇబ్బందిగా ఉంది

పేరుకే పట్టణం. కానీ గ్రామానికంటే తీసికట్టుగా మారింది. పురాతన పైపులైన్లు కావడంతో లీకులకు గురవుతున్నాయి. చెత్త, వ్యర్థాలు చేరి నీరు బురదమయంగా మారుతోంది. బయట 20 లీటర్ల నీటిని రూ.30కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాజాం మునిసిపాల్టీపై ప్రభుత్వం శీతకన్ను వేయడం దారుణం.

- పి.జయలక్ష్మి, అమ్మవారి కాలనీ, రాజాం

### ప్రత్యేక ప్రణాళిక

మున్సిపాలిటీలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. సంకిలి పంపుసెట్ వద్ద తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. మోటార్లు మొరాయిస్తున్నాయి. పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దాంతోనే నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. సమస్యలను అధిగమించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడగలుగుతున్నాం.

- జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం

## పాలకొండలోనూ అవే కష్టాలు

పాలకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో వేసవి వచ్చిందంటే తాగునీటికి ప్రజలు కటకటలాడాల్సిందే. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజలకు తాగునీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు. వేసవి వచ్చిందంటే మరిన్ని కష్టాలు వచ్చిపడుతున్నాయి. దశాబ్దాలుగా సమస్య వెంటాడుతున్నా పరిష్కారానికి చొరవ చూపే నాథుడే కనిపించడం లేదు. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాన్ అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.57 కోట్లు కేటాయించాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను విస్మరించింది. దీనితో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. తాగునీటి సమస్య యథావిధిగా కొనసాగుతోంది. నాన్ అమృత్ పథకానికి సంబంధించి వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పనులు ప్రారంభించింది. 20 వార్డులకు గాను ఆరు వార్డుల్లో రోడ్లు తవ్వి పైపు లైన్లు వేశారు. జగన్నాథ స్వామి గుడి వద్ద ఎన్‌కేరాజపురం, ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంగణాల్లో రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేసి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ పనులు సకాలంలో చేపట్టకపోవడంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అనుయాయులకు పైపులైన్ కాంట్రాక్ట్ ఇచ్చారు. కాంట్రాక్టర్లు పైపులను తీసుకొచ్చి జగన్నాథ స్వామి ఆలయ సమీపంలో అందుబాటులో ఉంచారు. ఆ నిధులు కూడా కాంట్రాక్టర్‌కు జమ చేశారు. ప్రస్తుతం ఆ పైపులైన్లు వృధాగా పడి ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ తప్పిదం పట్టణ ప్రజలకు శాపంగా మారింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా ఈ పనులు పూర్తి చేసి తాగునీటిని అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


మురుగు కాలువలోనే తాగునీటి పైపులు

### కావలసినది కొండంత... అందిస్తున్నది గోరంత...

నగర పంచాయతీలో ప్రస్తుతం 38 వేల మంది జనాభా ఉన్నారు. వీరందరికీ రోజుకు సరాసరి 5.2 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం. ప్రస్తుతం ఉన్న రక్షిత పథకాల ద్వారా 2.44 ఎంఎల్‌డీ తాగునీరును మాత్రమే అందిస్తున్నారు. పట్టణంలో 2,176 పబ్లిక్, 436 ప్రైవేటు ట్యాప్‌లు ఉన్నాయి. 145 హ్యాండ్‌బోర్లు ఉన్నాయి. వీటి ద్వారా అందుతున్న తాగునీరు అంతంత మాత్రమే కావడంతో పట్టణ ప్రజలు తాగునీటి ఎద్దడిని తీ వ్రంగా ఎదుర్కొంటున్నారు. దశాబాల క్రితం వేసిన తాగునీటి పైపులైన్లు ఇప్పటికీ 70 శాతం మురుగునీటి కాలువల్లోనే ఉన్నాయి. ఇవి లీకవుతుండడంతో నీరు కలుషితమవుతోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

### శివారుకు అందని తాగునీరు...

పట్టణంలోని శివారు ప్రాంతాలైన గారమ్మ కాలనీ, ఎన్ఎస్ఎన్ కాలనీ, సంపత్‌సాయి నగర్, శ్రీనివాసనగర్, ఎన్‌కే రాజపురంతో పాటు పట్టణం నడిబొడ్డున ఉన్న ఎంఎంనగర్, గాయత్రీ కాలనీలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు అడపాదడపా ఓ ట్యాంకర్ ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ వారికి పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో కాలనీవాసులు అందుబాటులో ఉన్న వాటర్‌ప్లాంట్లను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకుంటున్నారు.

### తాగునీటి ఎద్దడిని నివారిస్తాం

పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నివారిస్తాం. ఇప్పటికే వివిధ కాలనీలకు అందుబాటులో ఉన్న ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకొని మరో ట్యాంకర్‌ను అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతాం

- టి.జయరాం, నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్, పాలకొండ


రోడ్డు పక్కన నిరుపయోగంగా ఉన్న పైపులు

### ఐదేళ్లుగా ఇక్కట్లు

గారమ్మ కాలనీలో తాగునీటి కష్టాలు తీవ్రతరమయ్యాయి. ఐదేళ్లుగా తాగునీటి సమస్య తీర్చాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. వేసవి వచ్చిందంటే మరింత జఠిలమవుతోంది. తక్షణమే ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి.

- ప్రశాంత్ కుమార్, గారమ్మ కాలనీ

### ఇబ్బందులు తప్పడం లేదు

వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా తాగునీటి కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వం స్పందించాలి.

- జి.రమణమ్మ, ఎన్ఎస్ఎన్ కాలనీ

## మన్యం జిల్లా కేంద్రంలోనూ అంతే..

పార్వతీపురం టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ వాసులకు ఈ ఏడాది కూడా తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. వేసవి సమీపిస్తున్నా తాగునీటి సరఫరాకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడమే దీనికి కారణం. గత కొన్నేళ్లుగా మన్యం జిల్లా కేంద్రవాసులు వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఇన్‌ఫిల్టర్ బావుల వద్ద నాగావళి నీటి పరిస్థితి ఇదీ...

### రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని..

ఏటా తాగునీటి సరఫరాకు సంబంధించి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నారే తప్ప ఆచరణలో చూపించడం లేదు. రెండు రోజులకొకసారైనా జిల్లా కేంద్రంలోని 30 వార్డులకు తాగునీటి సరఫరా చేయలేకపోతున్నారు. అధికారికంగా జిల్లా కేంద్రం జనాభా 60 వేలు. అనధికారికంగా ఈ సంఖ్య 80 వేలు దాటినట్టు అంచనా. ఏటా వేసవిలో తాగునీటి సరఫరాకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు పెడుతున్నట్టు లెక్కలు చూపుతున్నారు. ఈ ఏడాది కూడా సుమారు రూ.20 లక్షల వరకు తాగునీటి సరఫరాకు సంబంధించిన ఇన్‌ఫిల్టర్ బావుల్లోని మోటార్ల మరమ్మతులు, ప్రధాన, బూస్టర్ హౌస్‌ల వద్ద మోటార్ల నిర్వహణ, తదితర పనులకు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారు. కానీ జిల్లా కేంద్ర వాసుల తాగునీటి కష్టాలు తీరడం లేదు.

### శివారు కాలనీల్లో దాహం కేకలు

ప్రస్తుత జిల్లా కేంద్రానికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం మండలాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల వలసలు పెరిగాయి. కాలనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీరందరికీ తాగు నీటి సరఫరా పెద్ద సమస్యగా మారింది. జనశక్తి కాలనీ, వైకేఎం, నవిరి, గ్రీన్‌ఫీల్డ్ కాలనీ, వివేకానంద కాలనీతో తదితర ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు మరింత జటిలమవుతున్నాయి. ప్రజలు బిందెడు నీటి కోసం ట్యాంకర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా శివారు కాలనీలకు తాగునీరు గగనంగా మారుతోంది. కాలనీల ప్రజలు అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు అందించినప్పటికీ ఫలితం కనిపించలేదు. వేసవి కాలం వచ్చిందంటే భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు పనిచేయక, తాగునీటి ట్యాంకర్‌లపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏడాదైనా ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

### ప్రత్యేక ప్రణాళిక

తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తోటపల్లి వద్ద నాగావళి నదీ ప్రవాహం తగ్గడం వల్ల... పక్కనే బోర్లు తవ్వించాం. ఈ వేసవి కాలంలో జిల్లా కేంద్రంలోని 30 వార్డుల ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- సీహెచ్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

### ఎందుకీ అలసత్వం?

గత కొన్నేళ్లుగా తాగునీటి సరఫరాకు సంబంధించి పాలకులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారు. మా శివారు కాలనీలకు తాగునీటి పైప్‌లైన్లు వేయకపోవడం వల్ల బిందెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలి.

- ఎం.ప్రభాకరరావు, నవిరి కాలనీ, పార్వతీపురం

### ఎన్నిసార్లు విన్నవించినా...

ఏటా వేసవి కాలంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై పాలకులు, అధికారులు ఆలోచించకపోవడం విచారకరం. రోజు రోజుకు మా కాలనీలో తాగునీటి సరఫరా అధ్వానంగా మారుతోంది. అధికారులు, పాలకులకు తాగునీటి సరఫరాకు సంబంధించి విన్నవించుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలి.

- కె.గౌరి, వివేకానంద కాలనీ

## నీటి కష్టాలు తప్పేది ఎప్పుడో?

సాలూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు నిత్యం తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక 29వ వార్డు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మజ్జుల పేట వద్ద రెండు, గాంధీ పార్క్‌లో ఒకటి, మక్కువ బైపాస్‌కు వెళ్లే మార్గంలో ఒకటి ఇలా నాలుగు వాటర్ ట్యాంక్‌లు నిర్మించారు. సుమారు 3,700 కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీరు అందిస్తు న్నారు. 15వ వార్డు పెద్దకుమ్మరి వీధి, బంగా రమ్మ కాలనీ, శ్రీనివాసనగర్, పి.ఎన్.బొడ్డవలస, రామాకాలనీలో కొంత భాగం, కేవీఆర్ రియల్ ఎస్టేట్‌కు సమీపంలో ఉన్న ప్రజలకు పూర్తి స్థాయిలో కుళాయి పాయింట్లు లేవు. దీంతో మున్సిపల్ అధికారులు ట్యాంకర్లతో తాగునీటిని అందిస్తున్నారు. కేవలం ఉదయం పూట ఒక గంట మాత్రమే కుళాయి నీరు ఇస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ క్కువ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి ఉన్న మెట్లు శిథిలమై పోయి పది సంవత్సరాలు గడుస్తున్నాయి. దీంతో ఇప్పటి వరకు ఆ రక్షిత మంచినీటి పథకాన్ని శుభ్రం చేయలేదు. ప్రజలు ఆ నీటినే తాగాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కు ళాయిల ద్వారా నీటిని ఇచ్చే సమయాన్ని పెంచా లని స్థానికులు కోరుతున్నారు. మొత్తం కుళాయి లలో నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రక్షిత మంచి నీటి పథకాలకు మెట్లు నిర్మించాలని కోరు తున్నారు. ట్యాంకులను శుభ్రం చేసి...తాగునీరు సరఫరా చేయాలని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.


కుళాయి నీరు పడుతున్న మహిళలు


శిథిలమైన రక్షిత నీటి పథకం మెట్లు

## అసెంబ్లీలో మన వాణి

### మహిళా సాధికారిత కూటమితో సాధ్యం



విజయనగరం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత కూటమి ప్రభుత్వంతో సాధ్యమని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అనాంనరు. బడ్జెట్‌పై జరిగిన సమీక్షలో ఆమె మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తున్న కారణంగా వచ్చే ఏడాది మహిళా సాధికారితతో పాటు, స్త్రీ, శిశు సంక్షేమానికి, మహిళల కోసం కేటాయింపులు భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. 2019 నుంచి 2024 వరకూ వైసీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని విస్మరించిందని, బడ్జెట్‌లో కూడా ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేకపోవడంతో మహిళలు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించడంతో పాటు, రానున్న కాలంలో మరిన్ని నిధులు కేటాయించే అవకాశం ఉందని సభలో చెప్పారు. దీనికి కూటమి పార్టీల ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.

### బొద్దాం హైస్కూల్ ప్రస్తావన



వేపాడ/ శృంగవరపుకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాంలో గల జడ్పీ ఉన్నత పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం శాసనసభలో ప్రస్తావించారు. దాంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలగా స్థాయి పెరిగి పదేళ్ల కావస్తున్నా శాశ్వత భవనాలు లేవని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సభలో మాట్లాడారు. భవనాలు మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు విన్నవించారు.

### దేవదాయ భూములు లీజుకు ఇవ్వండి



శృంగవరపుకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దేవదాయ భూములను గుర్తించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం శాసనమండలిలో ప్రస్తావించారు. ఆ భూములను లీజుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించాలని దేవదాయ, రెవెన్యూ శాఖ మంత్రులను కోరారు. జిల్లాలో వందల ఎకరాల భూములు దేవదాయ శాఖకు ఉన్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు.

# ముందుచూపు కీలకం

- జిల్లాలో పెరుగుతున్న గ్లకోమా వ్యాధిగ్రస్థులు
- అశ్రద్ధ చేస్తే శాశ్వత అంధత్వ ముప్పు
- ప్రతి నెలా 300కుపైగా కేసులు
- నేడు ప్రపంచ గ్లకోమా నివారణ దినం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. చూపు లేకపోతే సృష్టినే చూడలేం. అటువంటి నేత్రాలకు చడిచప్పుడు లేకుండా హాని తలపెడుతూ కంటి చూపును హరించేది గ్లకోమా. ఈ వ్యాధి రోగికి ఎటువంటి లక్షణాలు తెలియకుండా అంధత్వానికి దారితీసేలా చేస్తుంది. జిల్లాలో ఇటు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లోనూ గ్లకోమా వ్యాధితో వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నెలకు 300పైగా గ్లకోమా కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గ్లకోమా నిర్ధారణ చేసే పరీక్షలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. అవగాహన లేక ఎక్కువ మంది బాధితులు పరిస్థితి విషమించాక ఆస్పత్రులకు వెళ్తున్నారు. కంటి చూపు పోయాక వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

గ్లకోమాపై అవగాహన కల్పించడానికి మార్చి 12న ప్రపంచ గ్లకోమా నివారణ దినాన్ని జరుపుకుంటున్నాం. ఈ ఏడాది థీమ్ 'గ్లకోమా లేని ప్రపంచం కోసం ఏకం కావడం'గా ప్రభుత్వం ప్రకటించింది. వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స చేస్తే దృష్టి నష్టాన్ని నివారించవచ్చునని చెబుతోంది.

**గ్లకోమా అంటే..**

గ్లకోమాని నీటి కాసుల వ్యాధి అని కూడా అంటారు. కంటిలోని ఒత్తిడి పెరగడం వల్ల ఆప్టిక్ నాడిని దెబ్బతీస్తుంది. దానివల్ల దృష్టి కోల్పోయే అవకాశం ఉంటుంది. వెంటనే చికిత్స చేయకపోతే, శాశ్వత అంధత్వానికి దారితీస్తుంది.

**అప్రమత్తతతోనే నివారణ**




గ్లకోమాకు కొన్ని రకాల ఔషధాలు, అలాగే శస్త్రచికిత్సల ద్వారా జరిగిన అంధత్వ నష్టాన్ని పెరగకుండా ఆపవచ్చు. గ్లకోమా వల్ల చూపు దెబ్బతిన్న ప్రాంతంలో తిరిగి చూపు రావడం అనేది అసాధ్యం. అందుకే గ్లకోమా రాకుండా ముందుగానే జాగ్రత్తలు పాటించాలి. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్న వాళ్లల్లో, అత్యధిక మైనస్ పవర్ ఉన్న వాళ్లల్లో గ్లకోమా సమస్య తలెత్తే వీలుంది. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలి.

**- డాక్టరు మంచు కుమారస్వామి, ఆప్తమాలజిస్ట్, స్వామి ఆసుపత్రి, విజయనగరం**

**కారణాలు ఇవీ..**

మధుమేహం, రక్తపోటు (బీపీ), జీవనశైలిలో మార్పులు కారణంగా కంటిలో ఒత్తిడి పెరిగినప్పుడు ఆప్టిక్ నాడి దెబ్బతింటుందని నేత్ర వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే వంశపారంపర్యం వల్ల కూడా నేత్ర సమస్యలకు కారణమవుతుంది. తాజా అధ్యయనాల ప్రకారం ఒత్తిడికి, ఆందోళన, గ్లకోమాకు కూడా సంబంధం వున్నట్టు తేలింది. ఒత్తిడి కారణంగా శరీరంలో కార్టిసాల్ స్థాయిలు పెరిగి, కంటిలో ఒత్తిడి అధికమవుతుంది. ఇలా పలుమార్లు ఒత్తిడి హెచ్చుతగ్గులు అయినప్పుడు కంటిలోని ఆప్టిక్ నరంపై ప్రభావం పడుతుంది. ఆహార నియమాలు పాటించకపోవడం, ధూమపానం, మద్యపానం, అధిక ఒత్తిడి, హ్రస్వ దృష్టి (మయోపియా), ముఖానికి రాసుకునే సౌందర్య క్రీముల్లో వాడే స్టిరాయిడ్స్ వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. గ్లకోమా సమస్యలో ప్రధానంగా కనుగుడ్డు పక్కల నుంచి కనుచూపు హరించడం మొదలవుతుంది. నేరుగా అన్ని చూడగలుగుతున్న నేపథ్యంలో పక్క నుంచి వచ్చే సమస్యలను పట్టించుకోరు. అనుమానం తలెత్తి వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకున్నప్పుడు మాత్రమే సమస్యలు బయటపడతాయి.




**లక్షణాలు ఇవే..**

గ్లకోమాలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి నెమ్మదిగా చూపు హరిస్తే, రెండో రకంలో చూపు హఠాత్తుగా పోతోంది. ఒకసారి కోల్పోయిన చూపును శస్త్రచికిత్సతో కానీ మందులతో కానీ తిరిగిచూపు తెప్పించే వీలు పడదు. సాధారణంగా కళ్ల నొప్పులు, వాంతులు, కళ్లు ఎర్రబారడం, దృష్టి లోపం, నేత్రంలో కాంతి వలయాలు కన్పిస్తుండడం, ఆకస్మిక దృష్టి లోపాలు గ్లకోమాలో కన్పి స్తాయి.

**అవగాహన కల్పిస్తున్నాం**

పార్వతీపురం మన్యం జిల్లావాసులకు ప్రత్యేకంగా గ్లకోమాపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

**- భాస్కరరావు, డీఎంహెచ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా**



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రీష్మ

### చంద్రబాబును కలిసిన గ్రీష్మ

అమరావతి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ నాయకురాలు గ్రీష్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

నెల్లిమర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఆవగాహన కల్పించారు.

### 'ఉపాధి'తో రైతులకు మేలు

గజపతినగరం మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పనులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి చేయిస్తోందని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షన్ముఖ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పట్రువాడ, కొత్త బగ్గాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం వల్ల ఇటు రైతులు, అటు వేతనదారులకు మేలు జరగుతోందన్నారు. ఆయనతో పాటు అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీనాథ్, డ్వామా పీడీ శారదదేవి, ఎంపీడీవో కల్యాణి, ఏపీడీ రమామణి, ఏపీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

### పార్టీని అభివృద్ధి చేయండి

శృంగవరపుకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పార్టీని అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్‌వర్మ, మండల పార్టీ అధ్యక్షుడు వారాది చిరంజీవి యాదవ్‌కు సూచించారు. మంగళవారం శృంగవరపుకోటలో వారు పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని తెలపాలన్నారు.

### మామిడి తోటల పరిశీలన

లక్కవరపుకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడి తోటల్లో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానశాఖాధికారి జమదాగ్ని తెలిపారు. మంగళవారం భీమాలిలో మామిడి తోటలను పరిశీలించారు. ఆయనతో పాటు ఉద్యానశాఖ అధికారి పద్మ ఉన్నారు.

### కార్మికుల భద్రత ప్రధానం

కొత్తవలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగి భద్రతా పరికరాలను ఉపయోగించుకుని విధులకు హాజరు కావాలని విశాఖకు చెందిన కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ తెలిపారు. ప్రతి కార్మికుడికి భద్రత ముఖ్యమన్నారు. మండలంలోని కంటకాపల్లిలోని శారదా మెటల్స్ అండ్ అల్లాయస్ కర్మాగారంలో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి భద్రతపై కార్మికులకు అవగాహన కల్పించారు. భద్రత విషయమై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కర్మాగార యాజమాన్య ప్రతినిధులు సనత్‌కుమార్, అనంత్‌కుమార్, విజయభాస్కర్, సూర్య భాస్కర్, సన్యాసిరావు పాల్గొన్నారు.

### 'ఉల్లాస్' వయోజనులకు పరీక్ష

● కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు 3 గంటలు పరీక్ష నిర్వహించనున్నట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. జిల్లాలో సుమారు 48 వేల మంది పరీక్ష రాయనున్నారని, అందుకు 875 పాఠశాలలు గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో ఆయా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా జవాబు పత్రాన్ని మూల్యాంకనం చేయుటకు, అర్హతగల అంగన్‌వాడీ టీచరు, పరీక్షల పరిశీలకులుగా వెలుగు ఏపీఎంలను నియమించాలన్నారు. పరీక్ష అనంతరం జవాబు పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, హాజరు పత్రాలు, మార్క్స్ అవార్డు షీట్‌లు నిర్దేశిత ప్రొఫార్మాలో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రసన్న, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి తదితరులు ఉన్నారు.

**దార్శనిక పత్రాల రూపకల్పనపై కసరత్తు**

నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికల రూపొందించడంలో భాగంగా జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్‌ల సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈనెల 15 ఉదయం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. వీరితో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన అన్ని వర్గాల నుంచి సూచనలు స్వీకరిస్తామన్నారు. అనంతరం వాటిని క్రోడి కరించి సమగ్ర దార్శనిక పత్రాన్ని రూపొందించడం జరుగుతుందన్నారు.

### అభివృద్ధి పనులు పూర్తి చేయండి: ఎస్పీ



పనులను పరిశీలిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. మంగళవారం పోలీసు కార్యాలయంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీపీవో ఏవో శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, నర్సింహమూర్తి, ఆర్ఐ గోపాలనాయుడు, ఆర్ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

### 'నాబార్డు' పనుల పరిశీలన



గ్రామీణ బజార్‌ను పరిశీలిస్తున్న నాబార్డు జీఎం

గజపతినగరం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో నాబార్డు నిధులతో చేపట్టిన పనులను జీఎం కె.వి.ఎస్.ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. స్థానిక పంచాయతీ పరిధిలో రూ.15 లక్షలతో జరుగుతున్న గ్రామీణ బజార్ పనులు, రూ.17 కోట్లతో చేపడుతున్న ఏరియా ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం నాగార్జున, పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు, బ్రెడ్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

మెంటాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం, కూనేరుకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన అభియోగాలపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. ఇక్కడి ఫీల్డ్ అసిస్టెంట్లు బినామీ మస్తర్లు వేసి సొమ్ము కాజేశారనేది స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. డీబీటీ మేనేజర్ ఆశిఫ్ విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో చిన అప్పయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సతీశ్ ఉన్నారు.

### ఉనికి కోసమే జగన్ పాట్లు: టీఎన్‌ఎస్‌ఎఫ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్

విజయనగరం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఇప్పుడు అందరూ గుర్తుకు వస్తున్నారని, ఆయన అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాలను విస్మరించారని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్ విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుపోరు, ఫీజు పోరు, యువత పోరు అంటూ రాజకీయ ఉనికి కోసమే జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు యత్నిస్తున్నారన్నారు. వీరిని రాష్ట్రంలో ఏ వర్గం నమ్మదన్నారు. 2019 నుంచి 2024 వరకూ రైతులు, విద్యార్థులు, యువతను జగన్ మోసం చేశారన్నారు. అధికారం కోల్పోగానే హఠాత్తుగా అందరూ గుర్తుకు వచ్చారన్నారు. ఐదేళ్లలో 4,371 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల కాలంలో దాదాపు రూ.800 కోట్లు విద్యార్థులు, యువతకు సంబంధించిన బకాయిలు చెల్లించారన్నారు. వైసీపీ తాజాగా చేపట్టనున్న యువత పోరుపై జగన్‌ను, ఆ పార్టీ నాయకులను యువత నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.సంతోష్‌కుమార్, సతీష్‌కుమార్ తదితరులున్నారు.

### బీసీలు అభివృద్ధి చెందాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని అన్నారు. బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనరు గొట్టాపు చిన్నంనాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధులు పాలవలస యశస్వినిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు రమణమూర్తి, మజ్జి అప్పారావు, అంబళ్ల అప్పలనాయుడు, కోట్ల మూర్తి, సూరిబాబు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీకి జరజాపుపేట విద్యార్థి

నెల్లిమర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలకు నెల్లిమర్ల నగర పంచాయతీలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మోహన్‌కృష్ణ ఎంపికైనట్టు హెచ్ఎం రేవల్ల ఆదినారాయణ, పీడీ నడిపైన సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వారు అభినందించారు.

**రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కేజీబీవీ విద్యార్థినిలు**

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కేజీబీవీ విద్యార్థినిలు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ బి.ఉమ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ జూడో పోటీలకు జిల్లా నుంచి బాలికల విభాగంలో కేజీబీవీకి చెందిన జె.కావ్య, పి.పావని, పి.జ్యోత్స్నరాణి, ఎస్.డిల్లీశ్వరి, కె.భార్గవి, బి.దీపిక, సత్య, అనూష, జయలక్ష్మి ఎంపికయ్యారని తెలిపారు.

### ఘనంగా మెరకతల్లి అమ్మవారి పండుగ

మండలంలోని మెరకముడిదాం, ఎం.పాలెం, సోమలింగాపురం గ్రామాల ఇలవేల్పు మెరకతల్లి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మెరకముడిదాంలోని అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పండగ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమరాధన చేశారు.

### శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

వేపాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రూపావతి అన్నారు. మంగళవారం బక్కునాయుడుపేటలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఉషారాణి ఉన్నారు.

### యువకుడి ఆత్మహత్య

**క్రైం న్యూస్**



జగదీశ్ (ఫైల్)

గంట్యాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి తన ప్రేమను అంగీకరించలేదని మనస్తాపంకు గురైన యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొటారుబిల్లి కూడలిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నా యి. కొటారుబిల్లి కూడలికి చెందిన పారాది జగదీశ్ (24) కొద్ది కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే తాము ప్రేమికులుగా కాకుండా స్నేహితులుగా ఉందామని సదరు యువతి జగదీశ్‌కు సెల్‌కు మెసేజ్ పంపింది. దీనిపై కట్టుబడి ఉండాలంటూ యువతికి సెల్‌లో జగదీశ్ బదులిచ్చాడు. చివరికి ఏమైందో తెలియదు కాని సోమవారం మధ్యాహ్నం ఐ విల్ మిస్ యు అంటూ జగదీశ్ తన ఫోన్‌లో స్టేటస్ పెట్టాడు. అప్పటి నుంచి కన్పించ లేదు. స్నేహితులు, బంధువులు ఆయన ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతి కారు. ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం కొటారుబిల్లిలో ఓ మామిడి తోటలో చెట్టుకు జగదీశ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు బహిర్భూమికి వెళ్లిన స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సాయి కృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### ఆస్తి కోసం గొడవ.. తల్లిదండ్రులపై దాడి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం జరిగిన గొడవలో తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్క, అన్నయ్యలకు స్వల్పంగా గాయపడ్డారు. బాధితుల వివరాల మేరకు.. విజయనగరం మండలం ముడిదాం గ్రామానికి చెందిన మజ్జి పైడితల్లి (60) ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, భర్త రాము (70)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నవాడైన మాజీ సైనికుడు మజ్జి శివ కొంత కాలంగా ఆస్తి తన పేరిట రాయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాడు. కుమారుడి వల్ల ప్రాణ హాని ఉందని రూరల్ పోలీసు స్టేషన్‌లో పలుమార్లు వారు ఫిర్యాదు చేశారు. అయినా శివను వారించే ప్రయత్నాలు జరగలేదు. మంగళవారం ఉదయం మజ్జి పైడితల్లి, రాము వద్దకు వచ్చి శివ మరోసారి గొడవకు దిగాడు. శివతో పాటు ఆయన భార్య నందిని అత్తామామతో గొడవకు దిగింది. ఆగ్రహావేశాలకు గురైన శివ ఐరన్ రాడ్‌తో తల్లిదండ్రులపై దాడిచేశాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. శివను సోదరి, సోదరుడు వారించడం తో వారిపైనా దాడికి తెగబడ్డాడు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. రాము, పైడితల్లిలను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శివ నుంచి తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు వారు తెలిపారు.

### 50 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు నుంచి కారులో తరలిస్తున్న 50 కేజీల గంజాయిను స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. గంజాయితో పాటు తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు.

### పీడీఎస్ బియ్యం స్వాధీనం

విజయనగరం క్రైం, మార్చి 11 ( ఆంధ్రజ్యోతి): నగరంలోని తహసీల్దారు కార్యాలయం రహదారిలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని డీటీ రామారావు పట్టుకున్నారు. తహసీల్దారు కూర్మనాథరావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. బియ్యంతో పాటు బియ్యం రవాణా చేస్తున్న టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని రూరల్ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న 780 కిలోల బియ్యాన్ని గొడౌన్‌కు తరలించినట్టు తెలిపారు.

# ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకుడు గురాన అయ్యలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో ఈ నెల 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని జనసేన నాయకుడు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. మంగళ వారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం నియోజకవర్గం నుంచి 6 బస్సులు, 50 కార్ల ద్వారా సభకు బయలు దేరుతున్నామన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూప్‌లు లేవన్నారు. విజయనగరంలో జరిగిన సన్నాహక సభకు సమాచారం లేకపోవడంతో అదేరోజు కాకినాడలో లాజిస్టిక్స్ కమిటీ సమావేశం ఉండటంతో సన్నాహక సభకు హాజరు కాలేకపోయానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఆదాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● జామి: మండల కేంద్రమైన జామిలో మంగళవారం జనసేన పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్‌ను నియోజకవర్గ నేతలు సత్యనారాయణ, వర్మరాజు ఆవిష్కరించారు. పిఠాపురంలో నిర్వహించనున్న సభకు శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

## బొబ్బిలి-మక్కువ రోడ్డును నిర్మించండి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బేబీనాయన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నుంచి పార్వతీపు రం మన్యం జిల్లా మక్కువకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితిపై బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించా రు. బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస, నారసింహుని పేట తదితర గ్రామాల మీదుగా మక్కువ వరకు వెళ్లేరోడ్డు చాలా దయనీయంగా ఉందన్నారు. శంబ ర ఉత్సవాలను అధిక సంఖ్యలో భక్తులు ఈ మార్గంలో తరలి వెళ్తుంటారని, వారంతా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నా రు. ఈ రహదారి నిర్మా ణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రామభద్రపురం మండలం కొత్తరేగ-పాతరేగ గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని కోరారు. కొండకెంగువ గ్రామంలో దేవుడిబాబు ఆశ్రమానికి వెళ్లే దారిలో చిన్న వంతెన నిర్మాణార్థం నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## తోటపల్లి నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి నిర్వాసి తులకు ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం అసెంబ్లీలో కోరారు. కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలంలో తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించా లని మంత్రిని కోరారు. ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో కొందరికి ప్యాకేజీ అందలేదని అసెంబ్లీ వేదికగా తెలిపారు. వర్షాకా లంలో నిర్వాసిత గ్రామాల్లోని ప్రజలు నిద్రలు లేని రాత్రులు గడుపుతున్నారన్నారు. హుదూద్ తుఫాన్ వల్ల తిత్తిరి గ్రామంలో ఇళ్లు ఎగిరిపోయి పాడైపోయాయన్నారు. 2018లో జీవో నెంబర్-88 ఇచ్చారని, ఇప్పుడు కూడా ఈ జీవోను పునరుద్ధరించి ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని కోరారు.

## విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అదృష్టం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభు త్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే లు భాగస్వాములు కావాలని విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ కోరడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పార్వతీ పురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళ వారం ఆయన శాసనసభలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశా లల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలను వేర్వేరుగా కూర్చోబెట్టి విద్యాబోధన చేసే పద్ధతి ఇంకా కొన్ని చోట్ల కొనసాగుతుంద ని, ఈ విధానానికి స్వస్తి పలకాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రెండు సార్లు తమ జిల్లా విద్యార్థులే రాష్ట్ర స్థాయిలో ముందంజ లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహం, మౌలిక సదుపాయాలు కల్పి స్తే ఈ ఏడాది కూడా మొదటి స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించే అవకాశం ఉందన్నారు.

## పామాయిల్ రైతులకు ప్రోత్సాహకాలు

బొబ్బిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటలు వేసుకునే రైతులకు ప్రభుత్వ పరంగా మంచి ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు బొబ్బిలి ఉద్యాన శాఖాధికారి ఎస్.వెంకటరత్నం తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తమ పొలాల్లో బోరుబావిని కలిగిఉన్న రైతులకు హెక్టారుకు రూ.29వేలు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ తోటల్లో అంతర్‌పంటలుగా పెసర, మినుము, మొక్కొజొన్న, అల్లం, పసుపు, కూరగాయలు వంటివి పండించాలనుకుంటే హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో అందిస్తామన్నారు. ఐదెకరాల పైబడి ఉన్న వారికి 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

## సీబీఎం స్కూలుపై అసెంబ్లీలో చర్చించాలి


చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న దృశ్యం

బొబ్బిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీబీఎం బాలికల హైస్కూలు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అంశంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబీనాయన చర్చించాలని పాఠశాల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాల ముందు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న మాట్లాడారు. చారిత్రాత్మకమైన పాఠశాల మనుగడను పూర్తిగా కనుమరుగు చేసే విధంగా నిర్వాహకులు వ్యవహరించారని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఈ పాఠశాల యధాతథంగా కొనసాగేటట్టు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మునకాల శ్రీనివాస్, వి.లక్ష్మునాయుడు, బి.రవికుమార్, పాలూరు కృష్ణ, ఎం.శ్రీహరి, తులసీరామ్ పాల్గొన్నారు.

## పాముకాటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

రామభద్రపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాయుడువలస గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్నిపల్లి సత్యనారాయణ(36) పాము కాటుతో మృతిచెందారు. వారం రోజులుగా నాయుడువలస మామిడితోటలో ఉపాధి పనులు చేపట్టగా, ఆ పనులకు కొలతలు వేసేందుకు సత్యనారాయణ శనివారం మధ్యాహ్నం అక్కడకు వెళ్లారు. తోటలోని ఆకుల కింద ఉన్న పామును చూసుకోకుండా కాలుతో మట్టేశారు. దీంతో పాము కాటు వేసింది. స్థానికులు బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఆయన మృతిచెందారు. మృతుని భార్య గత రెండేళ్ల కిందట మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హతగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు గ్రామ సచివాలయాని కి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు దరఖాస్తులను పరిశీలించి 26 నుంచి 30 వరకు క్షేత్రస్థాయిలో యూనిట్‌ను ఎంపీడీవో, బ్యాంకు అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. 31 నుంచి ఏప్రిల్ 2 వరకు అనర్హుల దరఖాస్తులను తిరస్కరించి, అనంతరం అర్హుల జాబితాను ఓబీఎంఎస్ పోర్టల్ ద్వారా కలెక్టర్ అనుమతికి పంపిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు వారు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ● రామభద్రపురం: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో రత్నం తెలిపారు. ఈనెల 22వ తేదీలోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

జియ్యమ్మవలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పథకాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మే 31లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు అన్నారు. అలమండ పంచాయతీ నిడగల్లుగూడ గ్రామంలో నిర్మించిన గృహ నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పీఎం జన్మాన్, పీఎంఏవై గ్రామీణ స్కీంలలో మంజూరైన ఇళ్లు మే 31 నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. పీఎంఏవై 2.0లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లు ప్రాప్తికి కుల, ఆదాయ, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

## మార్గం.. సుగమం

(5వ పేజీ తరువాయి)

మండల పరిధిలోని రైతులకు పరిహారం చెల్లింపులు జరుగుతున్నట్లు తెలిసింది. 2013 భూసేకరణ చట్టప్రకారం ప్రభుత్వం పరిహారం చెల్లించనుంది. సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయించిన భూ విలువ ప్రకారం వ్యవసాయ భూమికి సెంట్లు లెక్కన, వ్యవసాయోతర భూములకు గజాల లెక్కన పరిహారం అందిస్తారు. భూ విలువకు రెండున్నర రెట్లు చెల్లింపులు జరుగుతాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. విస్తరణ జరగనున్న పెందుర్తి-బొడ్డవర రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలను లెక్కిస్తున్నారు. వీటి విలువ ప్రకారం పరిహారం చెల్లించేందుకు నివేదికలు తయారు చేస్తున్నారు.

**నాలుగు మండలాల మీదుగా రోడ్డు**

కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపుకోట మండలాల మీదుగా ఈ రోడ్డు విస్తరణ జరుగుతుంది. మూడు బైపాస్‌లను నిర్మిస్తున్నారు. మొదటిది కొత్తవలస మండలం చింతలపాలెం నుంచి సంతపాలెం, దెందేరు, తుమ్మకాపల్లి, వీరభంద్రపురం, నిమ్మలపాలెం మీదుగా అప్పన్నపాలెం జిందాల్ పాఠశాల వద్ద తిరిగి కలుపుతారు. ఇది 11 కిలోమీటర్లు బైపాస్. కాగా రెండోది శృంగవరపుకోట మండలం వెంకటరమణ పేట నుంచి కొత్తూరు, ఎస్.కోట మీదుగా కాపు సోంపురం సమీపంలో తిరిగి కలుస్తుంది. ఇది ఆరు కిలోమీటర్ల వరకున్న బైపాస్. మూడోది బొడ్డవర కూడలి సమీపంలోని భవానీనగర్ నుంచి తాటిపూడి మీదుగా విజయనగరం ముందు వరకు వున్న జాతీయ రహదారి 516కు కలుపుతారు.

**మండలాల వారీగా సేకరిస్తున్న భూములు**

| మండలం | వ్యవసాయ భూమి (ఎకరాల్లో) | వ్యవసాయేతర భూమి (ఎకరాల్లో) |
|---|---|---|
| కొత్తవలస | 56.455 | 38.72 |
| లక్కవరపుకోట | 14.61 | 10.01 |
| వేపాడ | 4.09 | 1.08 |
| శృంగవరపుకోట | 62.62 | 7.87 |

## పైడితల్లి.. భక్తజనం ప్రణమిల్లి

(5వ పేజీ తరువాయి)

ప్రకారం కోడిపిల్లల్ని సైతం ఆలయం పైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సతీమణి శ్రీలక్ష్మి అమ్మవారిని మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఎస్‌వీఆర్. కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్ సారథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

**వైభవంగా ఘటోత్సవం**

జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం ఘటోత్సవం మంగళవారం రాత్రి 12.09 గంటల సమయంలో వైభవంగా జరిగింది. ఈనెల 7న నేత్రోత్సవం రోజున కొండంపేట ఘటాలయానికి తీసుకువెళ్లిన అమ్మవారిని మంగళవారం రాత్రి 12.09 గంటల ప్రాంతంలో ఆలయ ప్రవేశం చేయించారు. సాయంత్రం ఆరుగంటలకు కొండంపేటలో బయలుదేరిన అమ్మవారి ఘటాలు కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న ఆలయానికి చేరుకునేసరికి సుమారు ఏడు గంటల సమయం పట్టింది. అడుగడుగునా అమ్మవారి ఘటాలను ఎత్తుకునేందుకు భక్తులు బారులు తీరారు. చివరిగా ఆలయానికి ఎదురుగా ఉన్న వనంగుడి వద్ద కర్రప్రతిమలలో ఆవాహన చేసిన అమ్మవారిని విసర్జన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేమకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఆలయానికి తాళాలు వేశారు. దీంతో జాతర ముగిసినట్లయింది.

## తప్పంతా మీపై పెట్టుకుని..!

(5వ పేజీ తరువాయి)

సంబంధించి రూ.352 కోట్ల బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఇతర వృత్తిపరమైన కోర్సులు చదువుకున్న వారికి వందశాతం ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందని అప్పట్లో సీఎం జగన్ ప్రకటించారు కానీ అమలులో విఫలమయ్యారు. అది పేద విద్యార్థులకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు ఇప్పుడు ఆర్థిక భారం తప్పడం లేదు. కళాశాల యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో ప్రస్తుతం అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు. అప్పట్లో సీఎం జగన్ ప్రకటనలు చూసి చాలా మంది స్థోమతకు మించిన కాలేజీల్లో చేర్పించారు. ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడంతో నమ్మి మోసపోయారు.

● కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను జమ చేస్తోంది. ప్రాధాన్యతాక్రమంలో పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటున్నారు. తొలివిడతగా జిల్లాలో 38,354 మంది విద్యార్థులకు రూ.30.61 కోట్లు విడుదల చేశారు. ఎస్టీ విద్యార్థులకు శతశాతం నిధులు విడుదల చేయగా.. ఎస్సీ విద్యార్థులకు 40 శాతం..బీసీ విద్యార్థులకు 25 శాతం విడుదల చేశారు. మరో రెండు విడతల్లో మిగిలిన బకాయిలతో పాటు ఈ ఏడాదికి సంబంధించిన ఫీజును జమ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డిమాండ్ చేస్తూ వైసీపీ ఆందోళన చేపడుతుండడంపై అన్ని వర్గాలు విస్తుపోతున్నాయి. నిరసన కూడా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున జరుపుతుండడం గమనార్హం.

**పెండింగ్ పెట్టిందే మీరు..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ గత ప్రభుత్వంలోనే చెల్లించలేదు. చాలావరకూ పెండింగ్‌లో పెట్టారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతాక్రమంలో విడుదల చేస్తోంది. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని వైసీపీ ఆందోళనలు చేపడుతుంది? ఇప్పుడే నిధులు విడుదల చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు కదా.

- శాసపు రాజేష్‌కుమార్, తెలుగునాడు విద్యార్థి సంఘం నేత, రాజాం

## భూ కబ్జాలను కట్టడి చేయాలి

బొబ్బిలి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంతంలో జరుగుతున్న భూ కబ్జాలను కట్టడి చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సంబయ్య డిమాండ్ చేశారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ఉన్న చెరువు గర్భాలను కబ్జా చేసిన వారిని శిక్షించి, వెంటనే ఖాళీ చేయించాలని కోరారు. కొంతమంది పెత్తందారులు ఆక్రమించుకున్న దళిత, ఆదివాసీ ప్రజల భూములను వెంటనే అప్పగించాలన్నారు. సీబీఎం పాఠశాల భూముల రిజిస్ట్రేషన్ రద్దు చేసి, ప్రభుత్వం నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ చేయించాలని, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో దళిత గిరిజనులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి అప్పగించాలని డిమాండ్ చేశారు. పూల్ భాగ్ కాలనీలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గుర్రపు కోనేరు ఆక్రమణ భూస్థలంపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో అర్థం కావడం లేదన్నారు. అనంతరం డీటీవోకు వినతిపత్రం అందజేశారు.


నిరసన తెలుపుతున్న సోరు సాంబయ్య

## వీడీవీకేలు వృద్ధి చెందాలి

● పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ


వీసీలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వీడీవీకేలు వృద్ధి చెందాలని ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మంగళవారం పార్వతీపురంలోని తన చాంబర్ లో వీడీవీకేల నిర్వహణ, యంత్రాల కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడీవీకేల ఉత్పత్తులు పెంచేలా అవసరమైన యంత్ర సామగ్రిని వారికి సమకూర్చాలన్నారు. వీడీవీకేల ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వెలుగు ఏపీడీ, వెలుగు ఎనిమిది మండలాల ఏపీఎంలు, హెడ్‌క్వార్టర్ ఏపీఎంలు పాల్గొన్నారు.

## రుణాలు రికవరీ చేయాలి

● సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉన్నతి రుణాల రికవరీ వేగవంతం చేయాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు ఇచ్చిన ఉన్నతి రుణాలను వెంటనే రికవరీ చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఏడు టీపీఎంయూ మండలాల్లో రూ.7.67కోట్ల రుణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఉన్నతి రుణాలు కట్టని లబ్ధిదారులపై ఆర్‌ఆర్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడీవీకేల ద్వారా వచ్చే నిధులను సభ్యులకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీడీ సన్యాసిరావు,ఏపీఎంలు,సీసీలు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

బొబ్బిలి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్ కె.రమేష్ ఆకాక్షించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయన మండలంలోని మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులతో సమాఖ్య సమావేశం నిర్వహించారు. మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలతో జీవనోపాధి సాగిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సమావేశంలో 38 మంది వీవోఏలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి సంఘం జోనల్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్

రామభద్రపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ సెక్రటరీగా మండలంలోని కొట్టక్కి పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుల ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం ఈయన సాలూరు తాలుకా యూనిట్ ఎన్జీవో ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు.

### విచ్చలవిడి మద్యం వ్యాపారం తగదు

బొబ్బిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారం విచ్చలవిడిగా తయారయ్యిందని, దీనిపై ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని సీపీఎం నాయకుడు పి.శంకరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో ఈ వ్యాపారం విచ్చలవిడితనం పెరిగిపోయిందన్నారు. ఈ కార్యక్ర మంలో యుగంధర్, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

### పనిభారం తగ్గించండి

బొబ్బిలి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు మధుసూధనరావు ఆధ్వర్యంలో అధ్యక్షుడు రామవేంద్రరావు సమక్షంలో ఎంపీడీవో పి.రవికుమార్‌కు వినతిపత్రం అదంజేశారు. పని భారం తగ్గించాలని కోరారు.

### లివిరి డోలోత్సవాలకు రోడ్డు సిద్ధం

భామిని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రూ.2కోట్లతో మంజూరైన ఏబీ రోడ్డు నుంచి లివిరి గ్రామానికి రోడ్డు పూర్తయింది. గత రెండు నెలల నుంచి ప్రారంభించిన రోడ్డు పనులు నిలిచిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. డోలోత్సవాలు సమీపిస్తుండడంతో ఐటీడీఏ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు యాత్ర ముందు నిర్మించాలని నాయకులు కోరడంతో మంగళవారం పనులను పూర్తి చేశారు.

### జనసేన ఆవిర్భావసభకు తరలిరండి

వీరఘట్టం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వీరఘట్టంలోని జామివారి తోటలో కూటమి మండల నాయకులతో సమావేశమయ్యారు. బల్లా హరిబాబు, తూముల రమేష్, అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

### క్రాష్ ప్రోగ్రాం పరిశీలన

సీతానగరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బల్లకిస్తాపురం గ్రామంలో నిర్వహిస్తున్న క్రాష్ ప్రోగ్రాంను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈకి సూచించారు.



# జాతరే.. జాతర

● ఘనంగా గ్రామ దేవతల పండగలు ● అమ్మవార్ల ఆలయాలకు బారులు తీరిన భక్తులు

పల్లెల్లో జాతర సందడి మొదలయ్యింది. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భోగాపురం మండల కేంద్రంలో కనకదుర్గమ్మ, పోలిపల్లి గ్రామంలో పోలిపల్లి పైడితల్లమ్మ జాతరలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలిపల్లి జాతరలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతుసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రామభద్రపురం మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)

**దాడితల్లి ఉత్సవాలకు శ్రీకారం**

బొబ్బిలి: దాడితల్లి అమ్మవారి పండుగ నిర్వహణకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ప్రతిఏటా మే 4 ,5, 6 తేదీలలో మండలంలోని 12 గ్రామాలలో అమ్మవారి పండుగను ఒకేసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులోని భాగంగా గొల్లపల్లి- కృష్ణాపురం గ్రామాల శివారు నుంచి భక్తులు మేళతాళాలతో అమ్మవారిని గ్రామంలోనికి ఆహ్వానించారు.


మక్కువ: చదురుగుడిలో శంబర పోలమాంబను దర్శించుకుంటున్న భక్తులు, ఇన్‌సెట్‌లో అమ్మవారు

**శంబరకు పోటెత్తిన భక్తులు**

మక్కువ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రు ల ఆరాధ్యదైవం, భక్తుల కల్పవల్లి శంబర పోలమాంబ ఏడో వారం జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతివారం లానే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తెల్లవారుజాము నుంచే చదురుగుడి, వనంగుడి వద్ద క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివా సులునాయుడు పోలమాంబను దర్శించుకున్నారు.


రామభద్రపురం: ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు


భోగాపురం: పోలిపల్లిలో కర్రలతో ఊరేగింపులో పాల్గొన్న ఏపీ మార్క్‌ఫెడ్ కమిటీ చైర్మన్ బంగార్రాజు


బొబ్బిలి: అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తున్న గ్రామస్థులు